క్లుప్తంగా

శ్రీవారి పాదానికి జెడ్పీసీఈఓ పూజలు



శ్రీవారి పాదానికి పూజలు చేస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు రూరల్‌: చిత్తూరు మండలం టి.వేపనపల్లి సమీపంలో గోవిందరాజుల గుట్టలో వెలసిన శ్రీవారి పాదానికి ఆదివారం జెడ్పీసీఈఓ ప్రభాకర్‌రెడ్డి తరించారు. కుటుంబ సమేతంగా పాదానికి పాలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉపవాస దీక్షలు విరమించారు. గ్రామస్తులు ఆయన్ను సన్మానించి, ఆలయ నిర్మాణ పనులపై చర్చించారు. గ్రామస్తుల కోరిక మేరకు ఆదివారం ఉదయం టీటీడీ శిల్ప కళాశాల మాజీ ప్రిన్సిపల్‌ సుబ్రమణ్యం గుట్టపై ఉన్న శ్రీవారి పాదాన్ని పరిశీలించారు. ఈ పాదం తిరుమలకు 90 డిగ్రీల కోణంలో ఉందని, ఇది శ్రీవారి పాదమేనని ఆయన వెల్లడించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఆలయ నిర్మాణ విధి విధానాలపై చర్చించి త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తీర్మానం చేశారు.

పట్రంపల్లిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాత పార్థసారథినాయుడు

చిత్తూరు రూరల్‌: చిత్తూరు నగరం పట్రంపల్లిలో కొలువుదీరిన శ్రీ వినాయకస్వామికి ఆదివారం దాత పార్థసారథినాయుడు ప్రత్యేక పూజలు చేశారు. విశేషంగా అలకరించి ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు నిత్యపూజలు చేశారు. అనంతరం ఆయన 600 మందికి అన్నదానం చేశారు. నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

నేడు స్పందన

చిత్తూరు రూరల్‌: నగరంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్‌ మురళిమోహన్‌ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో నిర్వహించే స్పందనకు ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చని ఆయన పేర్కొన్నారు.

కార్పొరేషన్‌ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్‌: మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్‌ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్‌ కాల్‌ సెంటర్‌ 08572232745, వాట్సాప్‌ – 98499 07885 కు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.


బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు సన్మానం



మాజీ ఎమ్మెల్యే, ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

బంగారుపాళెం: భారతీయ జనతా పార్టీ శాశ్వత రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరిని ఆదివారం సన్మానించారు. స్థానిక ఎన్‌పీసీ పార్కు ఆవరణలో మండలశాఖ ఆధ్వర్యంలో శాలువలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రకాష్‌, నాయకులు అభిలాష్‌, విష్ణుష్‌కుమార్‌, హరిప్రసాద్‌, శరత్‌బాబు, జనార్దన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పూజ



నదుం: మండలంలోని జాండ్రపేట అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మండల పూజ చేయనున్నారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేసి 40 రోజులు పూర్తయిన సందర్భంగా పూజలతోపాటు అభిషేకాలు చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త సురేంద్రరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం నుంచి భక్తులకు ఆలయంలో అన్నదానం చేస్తామన్నారు.

పర్యావరణాన్ని రక్షిస్తూ నగరాభివృద్ధి

- స్వచ్ఛ చిత్తూరుకు కార్పొరేషన్‌ వినూత్న ప్రయత్నాలు
- ప్రజల్ని చైతన్యం చేస్తూ, వాళ్లు పాల్గొనేలా చర్యలు
- సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు యంత్రాంగం కృషి



ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న యువకులు

చిత్తూరు అర్బన్‌: పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే చిత్తూరు నగరాభివృద్ధి ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే చిత్తూరు మునిసిపల్‌ కార్పొరేషన్‌ యంత్రాంగం ప్రధాన కూడళ్లలో పచ్చదనం కోసం మినీ పార్కులను ఏర్పాటు చేసింది. షర్మన్‌ పాఠశాల నుంచి పీసీఆర్‌ కూడలి వరకు ప్రస్తుతం స్మార్ట్‌ రోడ్డు పేరిట చేపడుతున్న పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. చిత్తూరును సుందరంగా మార్చడంతో పాటు స్వచ్ఛ చిత్తూరు పేరిట నగరాన్ని మరింత అభివృద్ధి చేయడానికి మునిసిపల్‌ పాలకవర్గం అన్ని చర్యలు తీసుకోవడంతోపాటు నిధులను విరివిగా విడుదల చేస్తోంది. ఇదే సమయంలో చిత్తూరు సుందరీకరణ, స్వచ్ఛ చిత్తూరులో ప్రజల్ని సైతం భాగస్వామ్యం చేయడానికి కమిషనర్‌ చూపుతున్న చొరవ సత్ఫలితాలిస్తోంది.

ప్రజల్ని మమేకం చేస్తూ..

చిత్తూరుకు ఓ వైపు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సముచిత స్థానం తీసుకొచ్చేందుకు పారిశుద్ధ్య కార్మికులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. ఇదే సమయంలో నగర పౌరులకు సైతం ఇందులో బాధ్యత ఉండాలని కార్పొరేషన్‌ చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజల్ని మమేకం చేయాలని కమిషనర్‌ అరుణ భావించారు. ఇలా నగరంలో కార్పొరేషన్‌ వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. కార్పొరేషన్‌ చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజల్ని భాగస్వాములుగా చేరుస్తూ నగరాన్ని సుందరంగా ఉంచుకోవడంపై ఆలోచింపచేస్తున్నారు. గత వారం నగరంలోని 30 వేలకు పైగా నివాస ప్రాంతాల్లో దోమల నివారణకు ఇంటింటికీ తిరుగుతూ మందులు పిచికారీ చేయడంతో అధికారులు, యంత్రాంగంతోపాటు మహిళా సంఘాలు సైతం పాల్గొంటూ పౌరుల బాధ్యతను గుర్తు చేశారు.



సిద్ధార్థ నగర్‌లో మొక్కలు నాటుతున్న మేయర్‌ అముద



దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

పర్యావరణ హితం కోసం

మరోవైపు పర్యావరణాన్ని పరిరక్షించడానికి గత రెండు నెలల కాలంలో మునిసిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో దాదాపు 4 వేల మొక్కలను నాటారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు పౌరులు ఇందులో పాల్గొన్నారు. ఇటీవల పర్యావరణ హితం కోరుతూ, నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని సూచిస్తూ 2కే రన్‌ను నిర్వహించారు. ఇందులో పెద్ద ఎత్తున ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు. ఇక నగరంలోని 12 ఉద్యాన వనాల్లో ప్రజలతో కలిసి పరిశుభ్రత పనులు నిర్వహించారు. వర్షాలను దృష్టిలో పెట్టుకుని మురుగునీటి కాలువల్లో పూడికలు తీయించడం, రాత్రి వేళల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ సామాన్యుల సమస్యలపైనే యంత్రాంగం దృష్టి ఉండాలని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడంతో కార్పొరేషన్‌ తన వంతు ప్రయత్నం చేస్తోంది.

సీఎం ఆశయం మేరకే..



నగరంలో గతంలో, ఇప్పటికీ స్పష్టమైన మార్పులు తీసుకొచ్చాం. నగర అభివృద్ధిలో కార్పొరేషన్‌ యంత్రాంగం, కౌన్సిల్‌నే కాకుండా సామాన్యులను సైతం ఇందులో పాల్గొనేలా చేస్తున్న ప్రయత్నాలు మంచి ఫలితాలనే ఇస్తున్నాయి. చాలా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు ముందుకు రావడం అభినందనీయం. ప్రతి ఒక్క పనిలో ప్రజల్ని భాగస్వామ్యం చేస్తూ, వాళ్లలో బాధ్యత తీసుకురావాలనే సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా ముందుకు వెళుతున్నాం.

– డాక్టర్‌ అరుణ జంగిటి, కమిషనర్‌, చిత్తూరు మునిసిపల్‌ కార్పొరేషన్‌.

నేటి నుంచి కోనేటిరాయుని పవిత్రోత్సవాలు



గంగవరం: మండలంలో ప్రసిద్ధ టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ సూపరింటెండెంట్‌ మునిచెంగల్రాయులు ఆదివారం తెలిపారు. తొలి రోజు సోమవారం ఉదయం స్వామివారికి ఆరాధన, పుణ్యాహవచనం, సాయంత్రం 6గంటలకు అంకురార్పణం, రెండవ రోజు మంగళవారం ఉదయం పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం కుంభారాధన, హోమం, బుధవారం ఉదయం స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం పవిత్ర సమర్పణ, సాయంత్రం గ్రామోత్సవం, చివరిరోజు గురువారం ఉదయం ప్రధాన హోమాలు, సాయంత్రం పూర్ణాహుతి, కుంభ వాహన సేవతో స్వామివారి పవిత్రోత్సవాలు పరిసమాప్తమవుతాయని వివరించారు.

నేడు కీరమందలో సురక్ష

బంగారుపాళెం: మండలంలోని కీరమంద గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్‌ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు పేరుతో చెరువు కట్టను తవ్వేశారు



చెరువుకట్టను తవ్వేసిన దృశ్యం

గుడిపాల: చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ హైవేకు సంబంధించి నూతనంగా రోడ్డు మార్గాన్ని మోంటీకార్లో అనే కంపెనీ వేస్తోంది. మండలంలోని బంగారక్కచెరువులోనే రోడ్డుమార్గం వెళుతోంది. దీంతో ఇక్కడ చెరువుకట్టను ఏకంగా తవ్వేశారు. ప్రస్తుతం ఎగువ చెరువుల నుంచి ఈ చెరువుకు నీరు వస్తోంది. ఉన్నట్టుండి వర్షాలు వచ్చినట్లయితే గ్రామాలకు ముంపు సమస్య తప్పదు. ఇదే సమస్యను ఇరిగేషన్‌ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని చెరువుకింద సాగుచేస్తున్న ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

పీలేరు -కాణిపాకం బస్సు ప్రారంభం



నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

ఐరాల: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని వ్యవసాయ సలహా మండలి ఉపాధ్యక్షుడు లోకనాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పీలేరు డిపోకు చెందిన పీలేరు– కాణిపాకం నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్‌ బాబుకు మండల ప్రజలు పీలేరు నుంచి పాటూరు వయా ఐరాల మీదుగా కాణిపాకం వరకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని అర్జీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో బస్సు సర్వీసును ఏర్పాటు చేశారన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు పీలేరు నుంచి బయలుదేరి కాణిపాకానికి 7 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో 35 యర్లంపల్లె మాజీ సర్పంచ్‌ రాజేంద్ర, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు సురేంద్రయాదవ్‌, వార్డు సభ్యుడు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మోతాదుకు మించితే అనర్థమే

- పరిమితికి మించి రసాయనాలు వినియోగిస్తే నష్టం
- రక్షణ పరికరాలు లేకుండా పిచికారీ చేయడం ప్రమాదకరం



వరి పంటకు రసాయన మందును పిచికారీ చేస్తున్న రైతు

ఐరాల: వ్యవసాయంలో పంటలకు పెరుగుతున్న తెగుళ్లకు తగినట్లుగా పురుగుల మందులను వినియోగించడం క్రమంగా పెరిగిపోతుంది. దీని వల్ల నేల సారం దెబ్బతిని భవిష్యత్‌లో పంటసాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విత్తనాలు చల్లడం మొదలు పురుగు మందుల పిచికారీ వరకు రైతులకు సరైన అవగాహన ఉండడంలేదు. దీంతో కొంతమంది పురుగుల మందు, రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగిస్తున్నారు. ఫలితంగా పంటల దిగుబడిపై ఈ ప్రభావం చూపుతోంది. పొలాల్లో కలుపుమొక్కల నివారణకు విత్తనాలను వేసిన వెంటనే పురుగు మందును పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం పురుగులమందు వినియోగం పెరగడంతో లాభం కంటే నష్టం ఎక్కువగా జరుగుతుంది. భూసారం తగ్గడంతోపాటు భూమిలో ఉన్న మేలు చేసే వానపాములు వంటి జీవులు చనిపోతున్నాయి. రసాయన మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పురుగు మందు పిచికారీ చేసే సమయంలో రైతులు, కూలీలు సిగరెట్లు, బీడీలు, చుట్టలు తాగకూడదు. కళ్లు, నోరు, ముక్కు, ముఖాన్ని శుభ్రం చేసుకోకుండా చేతులతో రుద్దరాదు. భోజనం చేసే సమయంలో చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. పిచికారీ చేసే సమయంలో శరీరం కనిపించకుండా దుస్తులు ధరించాలి. వాడిన పురుగుమందు డబ్బాలను దూరంగా పడేయాలి. క్రిమిసంహారక మందులను ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



రైతులు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి. చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కులు లేకుండా పిచికారీ చేయరాదు. పంటలపై సరైన మోతాదులోని క్రిమిసంహారక మందులు వినియోగించాలి. లేకుంటే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది

– వరలక్ష్మి, ఏఓ, ఐరాల

బియ్యం తూకాల్లో తేడాలపై డీలర్ల గగ్గోలు

గుడిపాల: బియ్యం తూకాల్లో భారీ తేడాలు రావడంతో డీలర్ల గగ్గోలు పెడుతున్నారు. మండలంలో 49 రేషన్‌ షాపులకు చిత్తూరులోని ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌ నుంచి బియ్యం సరఫరా అవుతుంది. బియ్యం వచ్చిన ప్రతిసారీ తూకాల్లో తేడా రావడంతో లబ్ధిదారులకు బియ్యం ఎలా వేయాలని ఆందోళన చెందుతున్నారు. అక్టోబర్‌ కోటాకు సంబంధించి గుడిపాలలోని డీలర్లందరికీ ఒక్కోషాపును 70నుంచి 150 కిలోల వరకు తక్కువగా వచ్చిందన్నారు. దీనిపై చిత్తూరులోని ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌లో ఉన్న అధికారులను అడిగితే తాము వేసేది అంతే అని బరితెగించి చెప్పడం గమనార్హం. ఒక్కో బస్తాలో 5 కిలోల నుంచి 8 కిలోల వరకు తూకాల్లో తేడా వస్తోందని, గోడౌన్‌లో తూకాలు వేయకుండానే తమకు బియ్యాన్ని పంపిస్తున్నారని డీలర్లు వాపోతున్నారు. డీలర్ల ఎదుట బియ్యం తూకాలు వేసి పంపించాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా, వారు పట్టించుకోవడం లేదన్నారు. రేషన్‌షాపులకు బియ్యం సరఫరా చేసిన తరువాత ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌కు డీలర్లను పిలిపించుకుని వేలిముద్రలు వేయించుకుంటున్నారని డీలర్లు తెలియజేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని తూకాలు సరిగ్గా వచ్చే విధంగా చూడాలని డీలర్లు కోరుతున్నారు.



50కిలోల బస్తాలో ఉన్న బియ్యం 41కిలోల 580 గ్రాములు మాత్రమే

వరసిద్ధునికి కళాకారుల సాంస్కృతిక నీరాజనం



భరతనాట్యం చేస్తున్న కళాకారులు



నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక ప్రత్యేక ఉత్సవాల్లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారి ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులకు ఆలయ అధికారులు ప్రశంసాపత్రాలు అందించారు.

–కాణిపాకం(యాదమరి)



కాళికామాత అవతారంలో కళాకారిణి నృత్య ప్రదర్శన



కాణిపాకంలోని ఆస్థానమండపంలో కళావేదికపై భక్తి గీతాలను ఆలపిస్తున్న గాయకులు